విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 06, నవంబరు 2025

ఎంపీడీవోగా దస్తగిరి బాబు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల మండల ఎంపీడీవోగా దస్తగిరి బాబు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. బేతంచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న దస్తగిరి బాబు ఇటీవల ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. ఎంపీడీవోగా పదో న్నతి పొందిన దస్తగిరి బాబును ప్రభుత్వం బదిలీపై కొలిమిగుండ్ల ఎంపీ డీవోగా నియమించింది. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేప ట్టిన దస్తగిరి బాబును డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి గౌడ్, ఏవో ప్రసాద్ రెడ్డి, కార్యాలయ అధికారులు సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

శ్రీశైలంలో కార్తీకపౌర్ణమిని దృష్టిలో ఉంచుకొని పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

విశాలాంధ్ర - శ్రీశైలం: కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం, జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలంలో మల్లికార్జున స్వామి వారిని దర్శనం నిమిత్తం వివిధ ప్రాంతాలలోని భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు భక్తులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్న జిల్లా ఎస్పీ సునీల్ జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు శ్రీశైలం నందు పర్యటించారు. భక్తులు వెళ్ళే క్యూ లైన్‌లు, పార్కింగ్ ప్రదేశాలు, దేవాలయ పరిసరప్రాంతాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలించారు. భక్తులు వారితోపాటు వారి పిల్లలను పుణ్య స్నానాలు ఆచరించడానికి తీసుకుని వచ్చినప్పుడు వారి తల్లి దండ్రులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతంలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. పోలీసు వారి సూచనలు పాటిస్తూ, ఆనందంగా, ఆహ్లాదకరంగా పుణ్య స్నానాలు ఆచరించి సురక్షితంగా మీ గమ్య స్థానాలను చేరుకోవాలని అడిషనల్ ఎస్పీ భక్తులను కోరారు ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ శ్రీశైలం సీఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - గడివేముల : గడివేముల మండలంలోని కరిమద్దెల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 30 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో హరేంద్ర తెలిపిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన సింగారి ప్రసాదరావు కిరాణం షాప్ నడుపుకుంటూ ఒక ఇంటికి అద్దెకు తీసుకొన్నాడు. కిరాణా సామాన్‌ల నిలువ అను నేపంతో అక్రమంగా ప్రభుత్వ రేషన్ బియ్యం కొనుగోలు చేసి, అమ్మకాలు చేస్తున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం మండల ఆర్ఐజి పవన్ కుమార్ రెడ్డి, గ్రామ విఆర్ఓ బి.హరేంద్ర గ్రామ పెద్దలు ఈశ్వర్ రెడ్డి, అంకిరెడ్డి, రమణయ్య, సూర్యనారాయణ రెడ్డి గ్రామ పెద్దల సమక్షంలో సోదాలు నిర్వహించగా 30 రేషన్ బియ్యం బస్తాలను పట్టుకొని బాధితునిపై కేసు నమోదు చేసి, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అసత్య కథనాలు నమ్మి వజ్రాల వేటకు రావద్దు.

విశాలాంధ్ర - శిరివెళ్ల: సోషల్ మీడియాలలో యూట్యూబ్‌లలో వస్తున్న అసత్య కథనాలను నమ్మి వజ్రాల వేటకు వచ్చి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని ఎస్ఐ చిన్న పేరయ్య సూచించారు. మండల పరిధిలోని నల్లమల అడవి సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సమీపంలోని వాగులో వజ్రాల వేట ముమ్మరంగా కొనసాగుతున్న సందర్భంగా వృద్ధులు వితంతువులు, దివ్యాంగులు, చిన్నారులు సైతం వజ్రాల వేటకు వచ్చి అస్వస్థతకు గురి అవుతున్నారని ఎస్సై తెలిపారు. నల్లమల అటవీ సమీపంలో క్రూర మృగాల సంచారం అధికంగా ఉంటుందని చెరువులు, వంకలు, వాగుల గట్టున కొండచిలువలు విషసర్పాలు సంచారం అధికంగా ఉంటుందని వజ్రాల వేటకు వచ్చే ఆసక్తిపరులకు ఆశావాదులకు ఎస్ఐ పీరయ్య పలు హెచ్చరికలు జారీ చేశారు.

గృహ నిర్మాణాలకు ధరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని లబ్ధిదారులు సొంత స్థలం ఉండి గృహ నిర్మాణాల కొరకు ఈ నెల 30 తేది లోపల ధరఖాస్తు చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ నవీన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ధరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 30 వరకు పెంచడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన ఆవాస్ పేస్ 2024 కింద లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలని వీటికి ప్రభుత్వం ఒక గృహ నిర్మాణానికి రూ.1.59 లక్షలు మంజూరు చేస్తుందని అన్నారు. ఆధార్ కార్డు,ఫెంషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఉపాధి హామీ జాబ్ కార్డు,స్థలానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లను ఈ నెల 30వ తేదీ లోపు సంబంధిత సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ కి అందజేయాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ భవనంలో ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తాహీర్‌హుసేన్ బుధవారం తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

సబ్‌రిజిస్టర్ కార్యాలయంపై అధికారులు దాడులు

- పరారైన డాక్యుమెంట్ రైటర్లు
- తనిఖీల్లో అదనపు మొత్తం లభించిందని వెల్లడించిన డీఎస్పీ సోమన్న

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై అధికారులు బుధవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లెక్కకు మించి అదనపు డబ్బు నిలువ ఉన్నట్లు గుర్తించామని డీఎస్పీ సోమన్న తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఏసీబీ అధికారులు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. ఏసీబీ అధికారుల దాడులు తెలుసుకున్న డాక్యుమెంట్ రైటర్లు స్టాంపు వెండర్లు, సబ్ రిజిస్టర్ కార్యాలయ ఆవరణంలో నుంచి పరారయ్యారు. కార్యాలయానికి తాళం వేసి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. దాడులు ముగిసే వరకు కార్యాలయం లోపల బయట ఎవరిని అనుమతించలేదు. ఈ దాడుల్లో లెక్కల్లో చూపని నగదు లభ్యమైనట్లు ఏసీబీ డీఎస్పీ సోమన్న విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ డిఎస్పి మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ సబ్ రిజిస్టర్ కార్యాలయం పై తమ సిబ్బంది పంచాయతీ దారులు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో నలుగురి వద్ద లెక్క చూపని నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేయడం జరుగుతుందని డి.ఎస్.పి సోమన్న తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

శివనామస్మరణతో మారుమోగుతున్న శ్రీశైలం

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని దేశ నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకొన్నారు. పవిత్ర పాతాళ గంగలో పుణ్య స్థానాల ఆచరించి కార్తీక దీపం వెలిగించి, తమ తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. కార్తీక పౌర్ణమి కావటంతో శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ఆలయ వేళలో మార్పులు చేయటంతో పాటు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేలాగా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులకు అల్పాహారం, పాలు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.

ఏఐటీయూసీ జిల్లా జనరల్ బాడీ సమావేశం

విశాలాంధ్ర-డోన్ : ఈ నెల నవంబర్ 9వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు నంద్యాల జిల్లా కేంద్రంలో నేషనల్ పీజీ కాలేజీలో ఏఐటీయూసీ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు హాజరవుతున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఏఐటియుసి డోన్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.అన్వర్, జి.అబ్బాస్ తెలిపారు. బుధవారం డోన్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలపై సమావేశంలో చర్చించి భవిష్యత్తు పోరాటాన్ని రూపొందిస్తామని తెలిపారు. కేంద్రంలో పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 కార్మిక సంక్షేమ చట్టాలను నాలుగు కోడ్స్‌గా తీసుకొచ్చి కార్మిక హక్కుల హరించడం కాక ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరించి ప్రధానంగా ఆంధ్రప్రదేశ్లో విశాఖ ఉక్కు ప్రైవేటుకించరించడం ఆశా, అంగన్వాడి, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలను చర్చించి, సమరశీల పోరాటాలకు వేదిక కానున్నాయన్నారన్నారు. అన్ని మండల నియోజకవర్గ కేంద్రాల నుండి ఏఐటీయూసీ ముఖ్యమైన అన్ని రంగాల నుండి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రవ్వలకొండ క్షేత్రంలో అయ్యప్ప స్వాములకు భిక్ష

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : పవిత్ర కార్తీక మాసోత్సవంలో భాగంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రవ్వలకొండపై శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తుల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నిత్యాన్నదాన సేవా సత్రంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, గుండ్లసింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ అన్నదాన సత్రంలో జరిగిన అన్నదాన వితరణ కార్యక్రమంలో గురుస్వామి, వైసీపీ పార్టీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పర్యవేక్షణలో పెద్ద ఎత్తున అయ్యప్పస్వామి మాల ధారణ దీక్ష స్వీకరించిన స్వాములు భిక్ష స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్టీ నాగరాజువర్మ, రాయల్ సుబ్బరాయుడు, ఎస్వీ చైతన్య వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, సందీప్ గౌడ్ అయ్యప్ప మాల ధరించిన స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువత ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: యువతలోని ప్రతిభను వెలికి తీయడానికి యువజనోత్సవాలు ఒక సువర్ణావకాశమని, యువత తాము నైపుణ్యం కలిగిన రంగాల్లో ప్రతిభను ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాల ఆడిటోరియంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా యువజనోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ జి. రాజకుమారి, ఎంపీ బైరెడ్డి శబరి, సెట్కూరు సీఈఓ డా.కె.వేణుగోపాల్, కళాశాల చైర్మన్ జి.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ ప్రగతి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువతలోని సృజనాత్మకత, ప్రతిభ, నాయకత్వ లక్షణాలను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం యువజనోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోందని తెలిపారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. యువత సాంప్రదాయ విలువలను కాపాడుకుంటూ ఆధునికతను అంగీకరించాలన్నారు. మహిళా క్రికెట్ జట్టు ఇటీవల వరల్డ్ కప్ గెలిచి దేశ గౌరవాన్ని నిలబెట్టిందని, యువత వారిని ఆదర్శంగా తీసుకొని తమ తమ రంగాల్లో ప్రతిభ చూపాలని పిలుపునిచ్చారు.

సంతాన సాఫల్య వ్రతపూజ

విశాలాంధ్ర - పాణ్యం: మండల పరిధిలో గల ఎస్.కొత్తూరు క్షేత్రంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం సంతాన సాఫల్య వ్రత పూజ నిర్వహించడం జరిగిందని ఆలయ అర్చకులు నారాయణ స్వామి, సురేష్ స్వామి, ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహం జరిగి సంతానం లేని మహిళలకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో సంతాన సాఫల్య వ్రత పూజ నిర్వహించి, సుమారు 3000 వేల మంది మహిళలకు ఒడిబియ్యం, పసుపు కుంకుమలు సౌభాగ్యంతో వర్ధిల్లాలని దీవించడం జరిగిందన్నారు. కొత్తూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రధాన అర్చకులు కంపముల్ల వంశీయులైన నాగపుల్లయ్య శర్మ, వీరయ్య శర్మ అధ్వర్యంలో గత 8 సంవత్సరాలుగా ఈ సంతాన వ్రత పూజను నిర్వహించడం జరుగుతుందన్నారు. వేకువజామునే కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివానికి సర్వ సూక్తంతో పంచామృతాభి షేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. అర్చకులు శరభయ్య స్వామి, కిట్టయ్య స్వామి, వెంకటేష్ స్వామి,రోహిత్ స్వామి, గణేష్ స్వామి, మిలటరీ సుబ్బారెడ్డి, సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు వాగులు పొంగి ప్రవహించాయి. మండ లంలోని మదనంతపురం, అంకిరెడ్డిపల్లి, బందర్లపల్లి, తుమ్మలపెంట, గోరు మానుపల్లి, బెలుం, బెలుం సింగవరం,రాఘవరాజు పల్లి తదితర గ్రామాల పరిధిలో భారీ వర్షం కురిసింది. రెండు రోజులకు చిరుజల్లులు పడుతూ ఒక్క సారిగా బుధవారం భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్రత ఇక్కట్లు పడ్డారు. బందర్లపల్లి గ్రామ సమీపంలోని నేలబిలం మల్లెశ్వర స్వామికి వెళ్లే భక్తులు ఇక్కట్లు పడ్డారు. అయా గ్రామాల పరిధిలో పంటలు సాగుచేసిన రైతులకు ఆందోళన చెందుతున్నారు.

ఎర్రమల కొండల్లో భారీ వర్షం

విశాలాంధ్ర - అవుకు: మండలంలోని ఎర్రమల కొండల ప్రాంతంలో బుధ వారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో కొండమీది గ్రామాలైన కొండమ నాయిని పల్లి, జూనూతల, కునుకుంట్ల, ఉప్పలపాడు గ్రామాలోని వంకలు వాగులు పొంగి పొర్లాయి. ఉప్పలపాడు కునుకుంట్ల గ్రామాల మధ్య ఉన్న కాలువ గడ్డ వంక పొంగి పొర్లడంతో రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ బస్సు కునుకుంట్ల గ్రామంలోని నిలిచిపోయింది. ఎర్రమల కొండల్లో కురిసిన భారీ వర్షానికి అవుకు జలాశయం లోనికి ఎత్తిపోతల రూపంలో భారీగా వర్షం నీరు వచ్చి చేరుతుంది.

అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుకు కృషి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారిలు సమీక్షా సమావేశం నిర్వహించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ రాజకుమారిలు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వైద్య సేవలు, మానవ వనరుల కొరత తదితర వాటిపై అధికారులతో కూలంకషంగా చర్చించారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామన్నారు. ఆసుపత్రిలో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకట రమణ, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, పలువురు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పాణ్యం : మండల పరిధిలోని గోనవరం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ కాలనీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అకాల వర్షాలు పడుతుండటంతో నీరు ఎక్కడ వెళ్ళుటకు వీలు లేకుండా సిమెంటు రోడ్డుపై నీరు నిలువ ఉండడంతో కాలనీ వాసులు, వృద్ధులు, విద్యార్థులు, చిన్న పిల్లలకు చాలా ఇబ్బందికరంగా మారిందని స్థానిక ప్రజలు తెలిపారు. నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది.నీరు నిలువ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సమస్యను ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరీ కమిటీ సభ్యులు పిడతల దానం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వెంటనే స్పందించిన అధికారులు నిలువ ఉన్న నీటిని బుధవారం ఆయిల్ ఇంజన్ సహాయంతో బయటకు పంపినారు. ఈ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే కాలనీ వాసులకు హామీ ఇచ్చారని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరీ కమిటీ సభ్యుడు దేవ దానం తెలిపారు.

ఘనంగా ముగిసిన టీటీడీ ధార్మిక సప్తాహం

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణంలోని కోటవీధిలో కొలువైన శ్రీ వీరభద్ర భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు గత ఏడు రోజుల నుండి జరుగుతున్న ధార్మిక సప్తాహం బుధవారం జ్వాలా తోరణం, తులసిమొక్కల వితరణ, కార్తీకదీపోత్సవంతో అత్యంత వేడుకగా ముగిసినది. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు విశిష్టమైన వ్యక్తులచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక శ్రీ గురుబసవేశ్వర సేవాసమితిచే పారాయణాలు, భజనలు, శ్రవణానందకరంగా సాగినది. ఈ కార్యక్రమాన్ని కాళ్ళూరి లక్ష్మీ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షులు శంకరప్ప, షరాఫ్ చక్రధర్, అర్చకులు చంద్రశేఖరయ్య, ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర్ రెడ్డి, జి.వేంకట రమణయ్య, సాహూరు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీఎం అధ్యాపకునికి డాక్టరేట్

విశాలాంధ్ర - పాణ్యం: ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు నాగరాజు పచ్చర్లకి విట్-ఏపీ యూని వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెక్యూర్ డేటా ఔట్ సోర్సింగ్ అండ్ ప్రైవసీ ప్రెసర్వింగ్ ఇన్ ఫాగ్ ఎనబుల్డ్ వానెట్స్ విత్ రేజిలెంట్ రౌటింగ్ మోడల్ అండ్ డైనమిక్ టాస్క్ ఆలోకేషన్ అనే అంశంపై నాగరాజు గారు చేసిన విశిష్ట పరిశోధనలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్.మిద్దె శాంతిరాముడు, మ్యానే జింగ్ డైరెక్టర్ ఎం.శివరామ్, డైరెక్టర్ (అడ్మిన్) డాక్టర్. డి.వి.అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ టి.జయచంద్ర ప్రసాద్, డీన్ (స్టూడెంట్ అఫైర్స్) డాక్టర్ బి.రామిరెడ్డి, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ కె.సుబ్బారెడ్డి నాగరాజుని తదితరులు అభినందించారు.

ఆత్మకూరు మున్సిపాలిటీ వార్డుల పెంపునకు ఆమోదం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: ఆత్మకూరు మున్సిపాలిటీ వార్డుల పెంపునకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం చైర్‌పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆసియా అధ్యక్షతన మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రభుత్వం ఆత్మకూరు మున్సిపాలిటీలో 24 వార్డులను 28 వార్డులకు పెంచింది. వార్డుల పెంపు అంశాన్ని ఆమోదించాలని అక్టోబర్ 9వ తేదీన చైర్ పర్సన్ డాక్టర్ ఆషియా మారూఫ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పురపాలక అధికారులు వార్డుల విభజన సక్రమంగా చేయలేదంటూ అజెండా అంశాన్ని వాయిదా వేశారు. వార్డుల విభజన సత్వరమే చేయాలని ప్రభుత్వం నుండి ఆదేశం ఉండటంతో మరుసటి రోజే మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం చైర్ పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆషియా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఎరషీద్‌లకు అధికారులు తెలిపారు. వార్డుల విభజన సరిగా చేయలేదంటూ తాము ఒప్పుకోలేదని, కౌన్సిల్ సమావేశంకు రావడం లేదని చెప్పారు. దీంతో అధికారులు, కొంత మంది కౌన్సిలర్లు వైస్ చైర్ పర్సన్ పువ్వాడి దివ్యను ఒక రోజు చైర్ పర్సన్ సీట్లో కూర్చో బెట్టి అజెండా ఆమోదించి, అధికారులకు పంపించారు. వైస్ చైర్ పర్సన్ వార్డుల విభజనను ఆమోదించే అధికారం లేదని, ఆ తీర్మాణం చెల్లదని రాష్ట్రస్థాయి అధికారులు ఫైల్ వెనక్కు పంపారు. దీంతో అధికారులు మరలా చైర్ పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆషియా దృష్టికి తీసుకువెళ్లి బుధవారం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్ డాక్టర్ మారుఫ్ ఆషియా, కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుసటి రోజు సమావేశం నిర్వహిస్తున్నట్లు అజెండా, సమాచారం గాని ఇవ్వకపోవడం వల్ల తాము కౌన్సిల్ సమావేశానికి హాజరు కాలేకపోయామని పలువురు కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కౌన్సిల్ సమావేశంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.కోటితో చేపట్టనున్న రహదారులు, కాల్వలకు సంబంధించిన అంశం, వర్షాల వల్ల గుంతలు ఏర్పడిన లోతట్టు కాలనీల్లోని రహదారులపై బిల్లుకు తరలింపు, మాజీ సైనికుడు లక్ష్మీ రెడ్డికి పన్ను మినహాయింపు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజగోపాల్, కమిషనర్ రమేష్ బాబు, ఏఈ షాహిర్ బాష, కౌన్సిలర్లు గౌస్ లాజం, సుల్తాన్, ప్రకాష్, సుగుణమ్మ, తిరుపమయ్య పాల్గొన్నారు.

ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ మోడల్ స్కూల్ విద్యార్థిని

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్ తీవ్ర పదజాలంతో మందలించడంతో విద్యార్థిని ఎలుకల మందు సేవించి, ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అప స్మారక స్థితిలో పడి ఉండగా విద్యార్థిని ఆదిలక్ష్మిని 108 వాహనంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థి తల్లి నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థులు తల్లిదండ్రుల తెలిపిన వివ రాల మేరకు మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం సిఇసి చదువుతున్న ఆదిలక్ష్మి తన స్నేహితురాలు అయిన విమోక్షిత జన్మదిన వేడుకలు ఇంట్లో జరుగుతుండగా మంగళవారం సాయం త్రం పాఠశాలకు వెళ్లి అక్కడినుండి విమోక్షిత స్వగ్రామం అయిన జూపాడుబంగ్లా లోని తన ఇంటికి వెళ్ళింది. పాఠశాల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా, హాస్టల్లో నుండి ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లి, ఎంతమంది వచ్చారని చూసుకోవాల్సిన బాధ్యత హాస్టల్ వార్డెన్‌దే. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం వల్ల విద్యార్థిని హాస్టళ్లకు రాలేదని రాత్రి 8:30 గంటలకు హాస్టల్ వార్డెన్ హాజరు వేసుకునే సమయంలో విద్యార్థిని లేదని గుర్తించింది. విద్యార్థిని ఆదిలక్ష్మి ఎక్కడికి వెళ్లిందని విద్యార్థులను అడగగా తన స్నేహితురాలు విమక్షిత ఇంటికి స్కూల్ వదిలిన తర్వాత జన్మదిన వేడుకలు అని వెళ్ళిందని వారు తెలిపారు. ఈ విషయం హాస్టల్ వార్డెన్ కళ్యాణి పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌కు విషయం చెప్పగా ఆయన తన స్నేహితురాలు విమోక్షిత ఇంటి ఫోన్ నెంబర్ వార్డెన్‌కు ఇచ్చారు. ఆ నెంబర్ ద్వారా హాస్టల్ వార్డెన్ ఆదిలక్ష్మితో మాట్లాడి ఇంటికి వెళుతున్నా అనే విషయం చెప్పకుండా వెళ్లడం కరెక్ట్ కాదని, ఈ విషయం మీ తల్లిదండ్రులకు చెపుతాననని హాస్టల్ వార్డెన్ విద్యార్థినికి చెప్పింది. నేను ఉదయం వస్తాను మేడం అని చెప్పినా హాస్టల్ వార్డెన్ తీవ్ర పదజాలంతో మాట్లాడడంతో విద్యార్థిని ఆదిలక్ష్మి ఆవేదనకు గురైంది. ఉదయం హాస్టల్‌కు రావడంతో హాస్టల్ వార్డెన్ ప్రిన్సిపాల్ దగ్గరికి విద్యార్థి ఆదిలక్ష్మి ని తీసుకెళ్లగా ప్రిన్సిపాల్ హాస్టల్ వార్డెన్ తీవ్రంగా మందలించారు. అంతలోపే తల్లి హాస్టల్‌కు రావడంతో తల్లి రాగానే మనోవేదనకు గురైన విద్యార్థిని ఆదిలక్ష్మి పాఠశాలలో ఉన్న టాయిలెట్ లోకి వెళ్లి ఎలుకల మందు సేవించి, ఎంతసేపటికి విద్యార్థిని బయటికి రాకపోవడంతో విద్యార్థులు టాయిలెట్ లోకి వెళ్లి చూడగా విద్యార్థిని ఆదిలక్ష్మి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో ప్రిన్సిపాల్ తల్లి హుటాహుటిన 108 వాహనంలో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం వల్ల ఈ విధంగా జరిగిందని విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి ఆదిలక్ష్మికి ఏం జరిగినా ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌లే బాధ్యత వహించాలని తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేసి హాస్టల్ వార్డెన్ కళ్యాణి, ప్రిన్సిపాల్ రమేష్‌లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుచున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 06, నవంబరు 2025

కార్తీక వనసమారాధనలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రకృతి సౌందర్యం కలిగిన పర్యాటక ప్రాంతం విజయవనం అని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి అన్నారు. బుధవారం కర్నూలు నగర శివార్లలోని వెంకన్న బావి సమీపంలోని విజయవనంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్తీక మాసంలో వనసమారాధన ఆచరి ంచడం పర్యావరణ పరి రక్షణకు, ఆధ్యాత్మిక వికాసానికి దోహద పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని పచ్చదనం పెంపొందించడంలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విజయవనం పార్కు ను పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. పర్యాటకులు ప్రకృతి సౌందర్యం కలిగిన విజయవనాన్ని సందర్శించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ కన్సర్వేటర్ బి.వి.కృష్ణమూర్తి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అటవీ శాఖ అధికారిని శ్యామల, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో రగులుతున్న

అసంతృప్తి జ్వాలలు

బుట్టారేణుక వర్గం అసంతృప్తి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఎమ్మిగనూరు నియోజకవర్గం సమన్వకర్తగా ఉన్న బుట్టారేణుకను తొలగించి మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి మనువడు ఎర్రకోట రాజీవ్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అదిష్టానం నియమించింది. 2024 ఎన్నికలలో ఓటమి తరువాత బుట్టారేణుక ఎమ్మిగనూరు నియోజకవర్గం సమన్వయకర్తగా వ్యవహరిస్తూ పార్టీ అదేశాలను పాటిస్తూ, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ వచ్చారు. తన కుటుంబానికి సమన్వయ కర్తగా ఇవ్వాలని ఎర్రకోట కేశరెడ్డి వత్తిడి మేరకు జగన్‌మోహన్‌రెడ్డి రాజీవ్‌రెడ్డికి సమన్వకర్తగా నియమిస్తూన్నట్లు ప్రకటించారు. దీంతో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బుట్టావర్గం అసంతృప్తితో భగ్గుమంటుంది. 2024 ఎన్నికల్లో ఎర్రకోట చెన్నకేశవరెడ్డి వర్గం గట్టిగా కృషిచేసి ఉంటే తాము విజయం సాధించే వారమంటున్నారు. నందవరం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల బుట్టారేణుక వర్గం అసంతృప్తితో రగిలి పోతున్నారు.ముఖ్యంగా వైసీపీలో ఉన్న ఎర్రకోట కేశవరెడ్డి సమీప బంధువులు సైతం బుట్టారేణుకకు మద్దతు తెలియచేస్తున్నట్లు తెలుస్తుంది. వైసీపీ అదిష్టానం బుట్టారేణుకను కర్నూలు పార్లమెంట్ ఇంచార్జీగా నియమించినా అందుకు ఆమె సుముకుత వ్యక్తం చేయడం లేదన్నట్లు తెలుస్తుంది. 2014 ఎన్నికల్లో అనూహ్యంగా వైసీపీ కర్నూలు ఎంపీగా బరిలో నిలిచిన బుట్టారేణుక విజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ అదికారంలోకి రావడంతో ఆమె టీడీపీలో చేరిపోయారు. 2019 ఎన్నికలలో బుట్టారేణుక కర్నూలు ఎంపీ సీటు టీడీపీ తమకే ఇస్తుందని ఆశించినా సీనియర్ నాయకులు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి టీడీపీలో చేరడంతో ఆయనకు సీటుకేటాయించడంతో బుట్టా రేణుక తిరిగి వైసీపీలో చేరిపోయారు.వైసీపీ అదిష్టానం కూడా కర్నూలు పార్లమెంటుసీటును డాక్టర్ సంజీవ కుమార్‌కు కేటాయించడంతో బుట్టారేణుకకు నిరాసే ఎదురైంది. 2024 ఎన్నికలలో వైసీపీ ఎమ్మిగనూరు సీటుకోసం బుట్టారేణుక చివరకు పోరాటం చేయడంతో అనూహ్యంగా ఆమెకు సీటు కేటాయించారు. అయితే ఈ ఎన్నికలలో బుట్టారేణుక పరాజయం పాలైనారు. అయినా నియోజకవర్గంలో ఆమె పార్టీ నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. అయితే అదిష్టానం ఎమ్మిగనూరు ఇన్‌చార్జిగా బుట్టారేణుకను తొలగించి ఎర్రకోట రాజీవ్‌రెడ్డిని ప్రకటిండంతో బుట్టారేణుకతోపాటు ఆవర్గం తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. బుట్టారేణుకకు వైసీపీ కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జిగా అదిష్టానం నియమించడంతో ఇప్పటి వరకు సమన్వయకర్తగా ఉన్న బీవై రామయ్య అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. 2024 ఎన్నికలలో ఆయన ఎంపీగా పోటీ చేసి ఓటమిపాలైనారు. మేయర్‌గా బాధ్యలు నిర్వహిస్తున్న బీవై రామయ్య జనవరిలో పదవీకాలం ముగుస్తుండంతో ఆయన పార్లమెంట్ ఇన్‌చార్జిగా పూర్తి కాలం పనిచేసే అవకాశం ఉంటుందని ఆశించినా అదిష్టానం నిర్ణయం ఆయనకు ఇబ్బంది కరంగా మారింది. బుట్టారేణుక కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకునేందుకు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. అదిష్టానం ఎప్పుడు ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో రాబోయో ఎన్నికలలో ఎవరికి సీటు కేటాయిస్తారో అన్న ఆందోళనలో నేతలు ఉన్నారు.తమ మనుమడుకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడం వలన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి పార్టీ పటిష్టత కోసం స్వయంగా రంగంలోకి దిగి సమన్వయం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మిగనూరు ఇన్‌చార్జి మార్పు వైసీపీలో అసంతృప్తి రగులుతుంది. అదిష్టానం ఎప్పుడు ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియక అయోమయంలో నేతలు ఉన్నారు.

హులెబీడు పాఠశాలలో ఆకతాయి అరెస్ట్

విశాలాంధ్ర - ఆలూరు : మండలం హులేబీడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం వివాదాస్పద ఘటన చోటు చేసుకుంది. పాఠశాల ఆవరణలో బహిరంగ ప్రదేశంలో బహిర్భూమి వెళ్ళిన విద్యార్థినులను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు చెట్టు పొదు గులో దాక్కొని గమనిస్తున్నాడు. ఈ విషయాన్ని గమనించిన పాఠశాల సిబ్బంది మరియు వంటశాల మహిళలు అతన్ని ప్రత్యక్షంగా పట్టుకుని చితకబాదారు. తదుపరి సమాచారం అందుకున్న ఆలూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆలూరు పోలీసులు తెలిపారు. పాఠశాలలో వంట చేసే సుశీలమ్మ మాట్లాడుతూ, విద్యార్థినులను గమనిస్తూ అనుచితంగా ప్రవర్తించిన అతన్ని పట్టుకుని వెంటనే పోలీసులకు అప్పగించాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాం అని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : ఈ నెల 9న ఆదివారం హైదరాబాద్‌నందు సబ్ జూనియర్, క్యాడెట్, సీనియర్. విభాగలలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా ట్రెజరర్ బిలాల్ బాష తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి ఈ నెల 15, 16న కాకినాడలో జరుగు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎన్నిక అవుతారన్నారు.

మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - హొళగుంద: మండల గౌరవ అధ్యక్షులుగా ఎస్.పోత రాజు, మండల అధ్యక్షు లుగా కె.శరణ బసప్ప, ప్రధాన కార్యదర్శిగ డి.పాండు రంగ, ఆర్థిక కార్యదర్శిగ కె.శ్రీనివాసు లు, మండల మహిళా కన్వీనర్‌గా యు.సరోజమ్మ తదితరులను ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా రిటైర్డ్ ప్రధానో పాధ్యాయులు జె.రమేష్ పాల్గొన్నారు. జిల్లా కౌన్సిలర్లుగా జి.దొడ్డ బసప్ప, ఎంసీ సుంకన్న, డి.చిన్నప్ప రెడ్డి, బీటీ ఖలందర్, ఎన్.ఈరన్నలను ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మండల ఉపాధ్యక్షులుగా కెఆర్ నాగరాజ శెట్టి, బి.గాది లింగప్ప, పి.చిరంజీవి, డి.కుమార్ నాయక్, మండల కార్యదర్శులుగా, కె.హనుమంతప్ప, బి.సురేష్, డేవిడ్, మిన్నారావు, ఆర్థిక కమిటీ సభ్యులుగా కె.మంజుల, బి.రమేష్, రవి నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు: ఏఐటి యుసి జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈ నెల 8వ తేదీన శని వారం సిపిఐ జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు కె.అజయ్ బాబు అధ్యక్షతన జరుగుతుందని, ఈ సమావేశంను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్పు కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లలితమ్మ, రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్ ముఖ్య అతిథులుగా హాజర వుతున్నారు. జిల్లాలోని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి, జిల్లా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని బుధవారం ఏఐటీసీ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మనెప్ప పిలుపునిచ్చారు. ఎంతో ప్రాధాన్యత కూడుకున్నదని తెలిపారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బి.నల్లన్న, బతకన్నా, పురుషోత్తం, రవిలు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర- చిప్పగిరి: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఆటోలలో ఎక్కించుకుంటే అట్టి డ్రైవర్లపై కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై సతీష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ నందు ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలకు, డ్రైవర్లకు సరైన పత్రాలను దగ్గర ఉంచుకొని ప్రయాణం చేయాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ప్రయాణం చేయిస్తే ఆటో డ్రైవర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, అలాగే మూడవ పార్టీ ఇన్సూరెన్స్ తప్పక చేవించాలన్నారు.

ఉరి వేసుకుని వృద్ధుడు మృతి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో పశువుల కొట్టంలో ఉరివేసుకొని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తొగర్చేడు గ్రామానికి చెందిన బోయ బజారికి (66) ముగ్గురు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. చెరుకులపాడు నారాయణరెడ్డిహత్య కేసులో ముగ్గురు కుమారులు ముద్దాయిలుగా ఉన్నారన్నారు. రెండో కుమారుడు రామాంజనేయులు ఆరేళ్ల కిందట ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. తన కుమారుల పరిస్థితి ఇలా అయిపోయిందని తండ్రి బోయబజారి అధికంగా ఆలోచన చేస్తూ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా దెబ్బతినిందన్నారు. హాస్పిటల్‌కి వెళ్లి చూపించుకొని రావడానికి తనకు ఎవరున్నారని మనస్థాపానికి గురైన బోయ బజారి పశువుల కొట్టంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకట లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

రికవరీ చేసిన 669 మొబైల్ ఫోన్‌లను బాధితులకు అందజేసిన ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: సైబర్ ల్యాబ్ పోలీసులు రికవరీ చేసిన 669 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బాధితులకు బుధవారం అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పేరడ్ మైదానంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్లను బాధిత ప్రజలకు అందజేశారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. సైబర్ ల్యాబ్ పోలీసులు 669 మొబైల్ ఫోన్ సుమారు రూ.1.20 కోట్లకు విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. 669 మొబైల్స్‌లలో అత్యధికంగా రికవరి చేసిన కర్నూలు ఫోర్త్ టౌన్ పియస్ కర్నూలు డిఎస్పీ ఆఫీసు అటాచ్ మెంట్‌లో పని చేస్తున్న శేఖర్ బాబు 96 మొబైల్స్, ఆదోనిటు టౌన్ పియస్‌కు చెందిన నాగరాజు 30 మొబైల్స్, ఇస్వి పియస్‌కు చెందిన రామచంద్ర 16 మొబైల్స్ రికవరీ చేయడంతో జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. సెల్‌ఫోన్ పొగోట్టుకున్న బాధితులు రికవరీ చేసి ఇచ్చినందుకు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: విశ్వబ్రాహ్మణులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వబ్రాహ్మణ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు న్యాయవాది కె.హరికృష్ణ ఆచారి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విశ్వబ్రాహ్మణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి సామాజిక వర్గంలోనే ఇలాంటి దాడులు చేసుకోవడం సిగ్గుచేటని తీవ్రంగా మండి పడ్డారు. మంత్రాలయం నియోజకవర్గం పెద్దవడుగూరు మండల పరిధిలో చిన్న తుంబలం గ్రామంలో వీరేష్ ఆచారి,కవిత దంపతులపై అదే గ్రామానికి బోయ నాగేష్, బోయ దస్తగిరమ్మ,బోయ గణేష్, తాయన్నలు కలిసి రాత్రి సమయంలో మూకుమ్మడిగా ఇంటిపైకి వెళ్లి దాడి చేయడం సిగ్గుచేటన్నారు. పోలీసులు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ హక్కుల పోరాట సమితి నాయకులు హేమంతు ఆచారి, బ్రహ్మయ్య ఆచారి, మోనిష్ ఆచారి, వేణు కుమార్ ఆచారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసిన ఎమ్పీడీవో

విశాలాంధ్ర - నందవరం: మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఎంపిడిఓ పుల్లయ్య తనిఖీ చేశారు. బుధవారం గ్రామంలో పర్యటించి అంగన్వాడి కేంద్రంలో రికార్డులు పరిశీలన చేసి, చిన్నపిల్లలకు మెనూ ప్రకారం, బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికా హారము అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, చిన్నపిల్లల యొక్క పరిశుభ్రత, పౌష్టిక ఆహారం అందించడంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. అనంతరం సచివాలయంలో సందర్శించి, సచివాలయ ఉద్యోగస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సమయపాలన పాటించలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సందీప్, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంగిన పాతర.. తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర - చిప్పగిరి: అప్పటి కాలం నాటి పాతర కుంగిపోవడంతో గ్రామ ప్రజ లను ఆశ్చర్యానికి గురిచేసింది. బుధవారం మండల కేంద్రం లోని ప్రధాన వాటర్ ట్యాంక్ వద్ద అప్పటి కాలంనాటి పాతర కుంగి పోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పాత్ర కృంగిన ప్రదేశంలో ప్రాథమిక పాఠ శాల ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందారు. పాత్ర కుంగే సమయంలో విద్యార్థులు ఎవ్వరు అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పాతర కుంగిన ప్రదేశం గ్రామంలోకి వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో గ్రామ సర్పంచ్ గోవింద రాజులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రమీళ పాతర కుంగిన ప్రదేశానికి చేరుకొని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రిప్పర్‌ల ద్వారా పెద్దపెద్ద రాళ్లను తెచ్చి పూడ్చి వేయించారు. ఎడతెరిపి లేని వర్షాలు కురవడం వల్లనే అప్పటి కాలం నాటి పాతర కుంగుతున్నాయని గ్రామస్తులు వాపోయారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - ఆలూరు: మండలంలోని మొలగవల్లి గ్రామంలో సిసి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని కమ్మ రామాంజి ఇంటి నుండి మారెమ్మ దేవాలయం వరకు రూ.20 లక్షల ఉపాధి నిధులతో సిసి రోడ్డును నిర్మించేందుకు ఎంపిటిసి సునంద పటేల్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి సునంద పటేల్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యం దృష్ట్యా రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడం సంతోషకరం. గ్రామ అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తాన అని తెలిపారు. గ్రామానికి వచ్చే రోజులలో మరిన్ని అభివృద్ధి పనులు తీసుకురావడానికి తనవంతు కృషి కొనసాగిస్తానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, యువత, పాల్గొన్నారు. ఎంపిటిసి సునంద పటేల్ యాదవ్‌ను గ్రామస్థులు పూలమాలలు వేసి సన్మానించారు. రోడ్డు పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు సులభమవుతాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

టికెట్లు అమ్ముకునే సంస్కృతి టీడీపీది కాదు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: టీడీపీకి, టీజీ కుటుంబానికి డబ్బులకు, టికెట్లు అమ్ముకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేటర్ ఎన్నికల్లో పార్టీకి డిపాజిట్లు ఇస్తేనే టికెట్లు ఇస్తారన్న పుకార్లపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఎవ్వరూ నమ్మొద్దన్నారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల్లో నమ్మకం పొందిన వారికే టికెట్లు కేటాయిస్తామని ఆయన అన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే నాలుగైదు సార్లు సమావేశాల్లో నాయ కులు, కార్యకర్తలకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పినట్లు తెలిపారు. కార్పొరేటర్ టికెట్ ఇచ్చే ముందు సర్వేలు చేయించి అందులో మొదటి స్థానంలో ఉన్న వారికే టికెట్ కేటాయింపు జరుగుతుందన్నారు. కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు అర్హత డబ్బు ఎంత మాత్రం కాదని, ప్రజల మనసు గెలిచిన వారికే టికెట్లు ఇస్తామని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదన్నారు. నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం సృష్టించేందుకు పనికట్టుకొని ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తుంటారని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు మాటలు నమ్మొద్దని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి టీజీ భరత్ చెప్పారు. నాయకులందరూ ప్రజల సమస్యలు, వార్డులో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు.

18, 19 తేదీల్లో జరుగు పత్తిరైతుల సమ్మేళనం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు: ఈనెల 18,19 తేదీల్లో ఆదోనిలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పత్తిరైతుల సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు కోరారు. సోమవారం సీఆర్ కార్యాలయంలో సమ్మేళనం కరపత్రాలను విడుదల చేశారు. డిహెచ్ పిఎస్ జిల్లా కార్యదర్శి సి.మహేష్, కల్లూరు మండల రైతు సంఘం కార్యదర్శి బి.రాముడు, అధ్యక్షులు పెద్దటేకూరు పుల్లన్న, దొడ్డిపాడు బాష, ప్రజానాట్య మండలి నాయకులు డప్పు మాణిక్యం, నాగలక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

వొకేషనల్ కాలేజిలో మెడికల్ ఎక్స్‌పో ప్రొగ్రామ్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని కాంకర్ వొకేషనల్ జూనియర్ కాలేజిలో మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్, యంపిహెచ్‌డబ్ల్యు (ఎఫ్) నర్సింగ్ కోర్సులకు సంబంధించి మెడికల్ ఎక్స్‌పో ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంకర్ విద్యా సంస్థల డైరెక్టర్ కొంకతి వేణుగోపాల్ పర్యవేక్షించి ఈ ప్రోగ్రాం వలన విద్యార్థులకు ఆయా కోర్సుల నందు చదువుతున్న విద్యార్థులు మెడికల్ ఎక్స్‌పో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కోర్సులకు సంబంధించి విద్యార్థులు అందరు పాల్గొని, విద్యార్థులు తమకు ఎంతో ఉపయోగపడిందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, వై.గౌతమి సంధ్య, ఎస్.నాగేంద్ర, ఎం.స్వాములు, కె.శ్రీనివాసులు, సబ్జెక్ట్ అధ్యాపకులు ఎ.జేమ్స్, ఇ.అనూష, ద్రాక్షాయణి, కళ్యాణి హరిత మాధవి లత అశోక్, కె.సురేఖ, బింధు లత తదితరులు పాల్గొన్నారు.

వరిపంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని మేకడోణ, చిన్నతుంబళం గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి సుచరిత ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి వరిపంటను పరిశీలించి, తగు సలహాలు, సూచనలు చేశారు. సుడిదోమ వల్ల పెద్ద పురుగులు, పిల్ల పురుగులు వరి దుబ్బుల మొదళ్లో చేరి రసాన్ని పీలుస్తుందన్నారు. దీంతో ఆకులు తెల్లగా ఎండిపోయినట్లు కనిపించడం జరుగుతుందని తెలిపారు. పురుగు మొదట్లో పొలంలో అక్కడక్కడ ఆశించి ఒక వలయం ఆకారంలో పంటను నాశనం చేస్తుందన్నారు. దీనిని నివారణకు ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల బాటను వదలాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నజ్రిన్, వీఏఏ హరి తేజ, రామేశ్వరి,వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు యల్లప్ప, రైతులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం పొలం పరిశీలన

విశాలాంధ్ర - నందవరం: మాచాపురం గ్రామంలో ఇంటి స్థలాల కోసం పొలాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షులు కాసిం వలిలు పరిశీలించారు. బుధవారం గ్రామంలో పర్యటించి, మాట్లాడుతూ ఇంటి స్థలాల విషయంపై జిల్లా కలెక్టర్ నివేదికలు అందిస్తామని, దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఎవరు అధైర్యం పడవద్దని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. పొలం రైతులతో న్యాయం జరగేలా చర్యలు తీసుకుంటామన్నావు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి మహేష్, వీఆర్వో నరసప్ప, గ్రామ టిడిపి నాయకులు పీర్ సాహెబ్, బడే సబ్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని, రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి రైతులకు సూచించారు. బుధవారం కల్లూరు మండలంలోని పెద్ద టేకూరు, తడకనపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పంటల సాగు ను పరిశీలించి రైతులతో సంభాషించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి పద్ధతుల్లో సాగు చేయడం వల్ల ఖర్చులు తగ్గి, నేల సారవంతం అవుతుందన్నారు. నీరు అందుబాటులో ఉన్న పొలాల్లో కాయగూరల వంటి తక్కువ పెట్టుబడి పంటలు సాగు చేస్తే రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతు కోటయ్య మాట్లాడుతూ 2.5 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నానని, ఎకరానికి సుమారు రూ.15 వేల నుండి రూ.20 వేల వరకు ఖర్చవుతుందన్నారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 6 నుండి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతు దస్తగిరి పొలాన్ని సందర్శించారు. ఆరు ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట పరిస్థితులను పరిశీలించారు.

తడకనపల్లెలో పశువుల హాస్టల్‌ను పరిశీలించిన కలెక్టర్ : తదుపరి తడకనపల్లె గ్రామంలోని పశువుల హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ 40 గేదెలు ఉన్నాయని, గ్రామంలో రోజుకు 500 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయని, వాటితో రోజుకు సుమారు 100 కిలోల పాలకోవా తయారు చేస్తున్నారని అధికారులు వివరించారు. జిల్లాలో ఈ పశువుల హాస్టల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రతి రైతు వ్యవసాయంతో పాటు పాడి పశువుల ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మరింత మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్ సహేరబి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-పత్తికొండ: నల్లగుట్ట కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి యు.కారుమంచి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు నెట్టికంటయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో కర్నూలు రోడ్డులోని సర్వే నెంబర్ 699లో సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో భూ పోరాటం చేపట్టి ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు, ఆటో యూనియన్ కార్మికులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నల్లగుట్ట కాలనీలో అనేకమంది కార్మికులు, నిరుపేదలు నివాసం ఉంటున్నా, రెవెన్యూ అధికారులు ఇంతవరకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయకుండా కాలయాపన చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అనంతరం తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద ఈరన్న, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి రంగన్న, నాయకులు జోహారాపురం కాశి, గుండు బాష, మాదన్న, రాజప్ప, నాగరాజు, చంద్ర, రవి, ఉచ్చన్న, రంగస్వామి, విజయ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ విక్రయానికి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఎలాంటి షరతులు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మదిరి ఎల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఇంచార్జీ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మదిరి ఎల్లప్ప, సిపిఐ మండల కార్యదర్శి కల్లూబావి రాజు, ఏపీ కాంగ్రెస్ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తూరు గంగన్న, నాయకులు శేషప్ప, మదిరి శాఖ కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ కంప్యూటర్‌లో కిషన్ కప్పింగ్ యాప్ డౌన్లోడ్ కావడం లేదని, రైతులు కిషన్ కంప్యూటర్లో సర్వర్ లేనందువలన గ్రామ సచివాలయంలో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు పరిశీలించి సర్వర్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి మార్కెటుకు కొనుగోలు చేయుటకు రైతులకు మద్దతు ధర రూ.8110 ప్రకారము ధరతో కొనుగోలు చేసే ఏర్పాటులు చేయాలన్నారు. తేమ శాతం లేకున్నా పత్తిని కొంతమంది రైతులు సిసిఐకి తీసుక వచ్చినపుడు సిబ్బంది వెనక్కు పంపుతున్నారన్నారు. పత్తి సాగుకు ఎరువులు, పురుగుమందులు, కూలి రేట్లు అనేకం పెరిగాయన్నారు.

విలేఖరులు కావలెను

విశాలాంధ్ర జాతీయ దిన పత్రికలో పని చేయుటకు కల్లూరు, కర్నూలు క్రైం, కర్నూలు జిల్లా పరిషత్, మద్దికెర, తుగ్గలి, కోసిగి, హొళహర్వి మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహం కలిగిన యువకులు కావలెను. అభ్యర్థులు కనీసం ఇంటర్ పాసై, తెలుగుపై మంచి పట్టు ఉన్న వారు అర్హులు. గతంలో విలేకరిగా పని చేసిన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యతం ఇవ్వబడును. ఆసక్తి గత యువకులు కర్నూలు విశాలాంధ్ర ఎడిషన్ కార్యాలయానికి బయోడేటా తీసుకుని స్వయంగా వచ్చి సంప్రదించగలరు. వివరాల కోసం 9492718399, 9491341661 నెంబర్లను సంప్రదించగలరు

మరిన్ని వార్తలు E-PAPERలో

ప్రైవేట్, ఆర్టీసి ట్రావెలింగ్ బస్సుల్లో ముమ్మర తనిఖీలు

- వాహనాల తనిఖీలు, భద్రతా ప్రమాణాల పర్యవేక్షణ
- భద్రతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం : జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

విశాలాంధ్ర - కర్నూలు : ఇటీవల బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో ప్రైవేట్, ఆర్టీసి ట్రావెలింగ్ బస్సులలో ముఖ్యంగా రాత్రి పూట తిరిగే బస్సులలో సరైన భద్రతా చర్యలు మరియు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన బస్సు దుర్ఘటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ గారు పోలీసు అధికారులను అప్రమత్తంగా ఉండాలని తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేస్తున్నారు. ప్రయాణికుల రక్షణ, భద్రతా ప్రమాణాలను పరిశీలించి, అవి సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించడానికి విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్‌ల లైసెన్సులు, బస్సుల్లోని భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించాలని వారిని హెచ్చరించి పంపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భద్రతా ప్రమాణాలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాల పై చర్యలు తీసుకోనున్నామని పోలీసు అధికారులు హెచ్చరించారు. పోలీసులు ఫేష్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు ఫేష్ వాష్ అండ్ గో కార్యక్రమం చేపట్టారు. హైదరాబాద్- బెంగుళూరు, హైదరాబాద్, చైన్నెల నేషనల్ హైవే- 40, నేషనల్ హైవే-44లలో ఉన్న పుల్లూరు టోల్గేట్, అమకతాడు టోల్గేట్, నన్నూరు టోల్గేట్‌లలో లారీలు, బస్సులు, కార్లు, మినీ వ్యాన్లు, లగేజీ బొలేరోలను పోలీసులు ఆపి ఆ డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని డ్రైవర్లకు గుర్తు చేస్తున్నారు. వాహనాలను డ్రైవర్లు అతి వేగంతో నడపకుండా, నిద్ర మత్తులోకి జారకుండా పూర్తిగా తేరుకుంటే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చనే జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో జిల్లాలో పోలీసులు ప్రధానంగా హైవేలపై ఈకార్యక్రమం నిర్వహిస్తున్నారు.

కుందు నది పరివాహక ప్రాంతం పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణంలోని రాణి మహారాణి థియేటర్ సమీపంలో గల కుందు బ్రిడ్జిని, పరిసర ప్రాంతాన్ని మంత్రి వర్యులు ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ ఆదేశాల మేరకు ఆర్డిఓ విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్నలు పరిశీలించారు. మొన్న కురిసిన మొంతా తుఫాను కారణంగా కుందునది పరిసర ప్రాంతాలు నీటితో మొత్తం జలమయమై కుందు బ్రిడ్జిపై రోడ్డు కొట్టుకు పోయి బ్రిడ్జి దెబ్బతినిందని, బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బ్రిడ్జిపైకి భారీ వాహనాలు ప్రవేశించకుండా ట్రాఫిక్ సిఐకి సూచించారు. అంతేకాక అటువైపు ప్రయాణిస్తున్న ప్రయాణికులకు బ్రిడ్జి వలన ఎలాంటి ఆటంకం జరగకూడదని అక్కడ పికెట్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా సగం నిర్మాణంలో ఆగిపోయిన నూతన బ్రిడ్జి పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా, మున్సిపల్ ఎంఇ గుర్రప్ప, డిఇ రసూల్, ఎఇ బాబావాలి, ఎస్ఆర్పిసి స్టాప్ ఇంజనీర్లు, 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు తదితరులు పాల్గొన్నారు

శ్రీ భక్త కనకదాసు 538వ జయంతి ఘనంగా నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర - హొళగుంద: శ్రీ భక్త కనకదాసు 538వ జయంతి ఘనంగా నిర్వహించుకోవాలని మండలం గౌరవాధ్యక్షులు కాలిక ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 538 వ జయంతి జరుపుకోవడానికి ప్రత్యేక జీవో విడుదల చేసి, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్య సంస్థలలో, సచివాలయాల్లో కనకదాసు జయంతి నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్కే గిరి, మాధసి కురువ సంగం ఆలూరు తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్దహ్యాట మల్లయ్య, గాదిలింగప్ప, వీరభద్రప్ప, మల్లికార్జున, ముద్దటమాగి, ఆనంద్, వీరేష్ పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో చండీహోమం

విశాలాంధ్ర - పెద్దకడబూరు: పెద్దకడబూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం ఆలయ పెద్దలు ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు గణపతికి, శివుడికి, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితులు రామశాస్త్రి, శ్రీధర్ స్వామి, బాబు స్వామి మంత్రోచ్ఛరణల మధ్య చండీహోమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం, సాయంత్రం లక్ష దీప అలంకరణ, జ్వాలాతోరణం నిర్వహించారు. చండీహోమం పూజా కార్యక్రమంలో తొగట వీరక్షత్రియ యూత్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డ్రోన్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : కర్నూలు బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం నాడు డ్రోన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా లోకవరపు భాస్కర్ త్రినాథ్, రిమోట్ పైలట్ ఇన్‌స్ట్రక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ డ్రోన్ కంపెనీ మన కర్నూలు జిల్లాలో స్థాపించబడడం ఒక శుభ సూచకమని, దీని వలన భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు విస్తరించి, నిరుద్యోగ సమస్య తగ్గిపోతుందని తెలిపారు. ముఖ్య అతిథి లోకవరపు త్రినాథ్ భాస్కర్ విద్యార్థులకు డ్రోన్ నిర్మాణం, ఉపయోగాలు, దానిని ఎలా ఆపరేట్ చేయాలో ప్రదర్శన ద్వారా వివరించారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు రామకృష్ణ, సుజాత, ఉల్గోజీ రావు, శ్రీధర్‌మూర్తి, శ్రావణి జస్వింత, భోధనేతర సిబ్బంది మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయం అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలం పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు నంద్యాల జిల్లా పాలమర్రి గ్రామానికి చెందిన బోయ రాజు దంపతులు లక్ష్మీ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ.25 చందాను డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేదపండితులకు అందచేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు చౌడేశ్వరి అమ్మవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

తుంగా తీరంలో తుంగ హారతి

విశాలాంధ్ర - మంత్రాలయం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి పునస్కరించుకొని శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజల నిర్వహించారు రాత్రి 7:30 గంటల సమయంలో తుంగభద్ర నది తీరంలో శ్రీ మఠం ప్రస్తుత పీఠాధిపతి శ్రీ సుబు . దేంద్ర . తీర్థులు ఆధ్వర్యంలో. తుంగ తీరంలో తుంగ హారతి నిర్వహించారు తుంగతీర హారతిలో వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో తుంగతీర తుంగ హారతిలో పాల్గొన్నారు అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనం చుట్టూ బంగారు వెండి వంటి రథోత్సవాలపై శ్రీ ప్రహ్లాదరాయల విగ్రహం నుంచి బృందావనం చుట్టూ భక్తుల మధ్య రథోత్సవం నిర్వహించారు

మురికికుంటగా ప్రభుత్వ పాఠశాల

విశాలాంధ్ర - నందికొట్కూరు: మండల పరిధిలోని దామగట్ల గ్రామం దళితవాడలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బురదకుంటగా భారీ విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండడంతో బుధవారం ప్రగతిశీలా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సందర్శించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి పి.మద్రిస్వామి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల క్రితం దామగట్ల గ్రామాన్ని దత్తత గ్రామంగా చేసి దళితవాడలో స్పెషల్ కోట కింద కేవలం షెడ్యూల్ క్యాస్ట్ వారికే పాఠశాలను అప్పటి ప్రభుత్వం కట్టించింది. కానీ నేడు అభివృద్ధికి నోచుకోక మురికికుంటగా మారి, పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు పెరిగి, విషపురుగుల స్థావరంగా మారిందన్నారు. స్కూల్ ప్రదేశంలో నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్, రైతు పనిముట్లు పెట్టడం వల్ల విద్యార్థులకు అసౌకర్యంగా ఉండటం, కాంపౌండ్ వాల్, నీటి సౌకర్యం లేక వంటగది శిథిలావస్థకు గురవుతూన్నప్పటికి పర్యవేక్షణాధి కారులు క్షేత్రస్థాయిలో సందర్శించక పోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధికి నోచుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. వీటిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు డివిజన్ సహాయ కార్యదర్శిలు అసిఫ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సర్వపాపహరణం జ్వాలాతోరణ దర్శనం

విశాలాంధ్ర - శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా బుధవారం నాడు ఆలయం ముందుగల గంగాధర మండపం వద్ద జ్వాలా తోరణోత్సవం సాంప్రదాయ పద్ధంగా జరిపించారు. పురాణపరంగా త్రిపురాసురులను సంహరించిన తరువాత పరమేశుని దృష్టిదోషపరిహారం కోసం, ఇంకా విజయుడైన అతని గౌరవార్థం పార్వతీదేవి మొదటగా ఈ జ్వాలాతోరణోత్సవాన్ని జరిపించిందనీ, అప్పటి నుండి ఇది ఆచారమైందని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఆలయంలో ఈ జ్వాలాతోరణోత్సవాన్ని జరపడం సంప్రదాయమైంది. ఈ జ్వాలాతోరణ దర్శనం విశేషఫలదాయకమని, ఈ జ్వాలా తోరణం ఉత్సవాన్ని దర్శించడం వల్ల పాపాలు తొలగి సద్గతులు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావు దంపతులు అర్చక వేద పండితులు అధికారులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎరుకల ప్రజల సమస్యలను పరిష్కారించాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: ఎరుకల ప్రజల సమ స్యలను పరిష్కారించాలని ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నల్లబోతుల కొండ య్య అన్నారు. విజయవాడలో మంత్రి నారా లోకేష్‌ని ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నల్లబోతుల కొండ య్య మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైదుకూరు 9 వార్డు ఎరుకల ప్రజల సమస్యలను ఆయన దృష్టికి తీసికెళ్ళి వాటిని పరిష్కారం చేయాలని కోరడం జరిగిందన్నారు. రాష్ట్రములోని పలు ట్రైబల్ సమస్యలపై ఆయనతో చర్చించి పరిష్కారం చేయాలని కోరారు.

శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని శివాలయాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వెలసిన శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో, చెర్లోపల్లి లో బుగ్గ మల్లేశ్వర స్వామి ఆలయంలో, శివవరంలో శివాలయాల్లో అర్చకులు శివుడికి అభిషేకం,పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి రోజున శివుడిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలు లభిస్తాయి అన్న నమ్మకంతో ప్రజలు పెద్ద ఎత్తున శివాలయాలకు చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు వేకువజామునసే శివాలయాల్లో ముగ్గులు వేసి కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరము భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సీపీఎం ఆధ్వర్యంలో జీపు ప్రచార జాతా ప్రారంభం

విశాలాంధ్ర -ఆలూరు: ఆలూరు నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఈనెల 9,10వ తేదీలల్లో జరగబోయే పాదయాత్ర విజయవంతం కావాలనే సంకల్పంతో సిపిఎం ఆలూరు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో జీపు ప్రచార జాతా రెండు రోజులపాటు నిర్వహించారు. ఈ జాతా బుధవారం ఆలూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద నుంచి ఘనంగా ప్రారంభమైంది. జీవజాతను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశులు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, సాగు, తాగు నీటి వంటి అనేక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, హనుమంతు, నారాయణస్వామి, కృష్ణ, షాకీర్, మైన, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు..

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

విశాలాంధ్ర - చాగలమర్రి: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాలలోని శివాలయాలు బుధవారం భకులతో కిటకిట లాడాయి. చాగలమర్రి పట్టణంలోని శ్రీ భీమలింగేశ్వర, రామలింగేశ్వర ఆలయాల్లో ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, శివలింగానికి అభిషేకాలు జరిపి స్వామివారికి ప్రత్యేక పూజలు, జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని మూడురాళ్ళపల్లె, చింతలచెరువు సమీపంలో నల్లమలలో వెలసిన బైరవ గుండాల క్షేత్రంలో శివ, పార్వతుల కళ్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. బైరవగుండాల క్షేత్రంలో మహిళలు కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్యోతులను తెలుగు గంగ ప్రధాన కాలువలో వదిలారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్ళగడ్డ డిఎస్‌పి ప్రమోద్ ఆదేశాల మేరకు ఆళ్ళగడ్డ రూరల్ సిఐ మురళిదర్‌రెడ్డి అధ్వర్యంలో ఎస్ఐ సురేష్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

బస్సుల భద్రత ప్రమాణాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రజ్ఞ డిగ్రీ కళాశాలలో పాఠశాలలు, కళాశాలలు బస్సులలో వెళ్లే విద్యార్థుల భద్రతా చర్యలపై అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర అవగాహన కల్పించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని స్కూల్స్ మరియు కళాశాలల బస్సులు ఉన్న ఇన్చార్జీలు మరియు కరస్పాండెంట్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి.నాగేంద్ర మాట్లాడుతూ ప్రతి వాహనానికి అత్యవసర ద్వారము, 60 కిలోమీటర్ల కు మించకుండా స్పీడ్ లాక్, ఫైర్ డిటెక్షన్, అలారం సిస్టం, అగ్నిమాప పరికరాలు ఉండాలని సూచిస్తూ హ్యాండ్ బ్రేక్, సాధారణ బ్రేకుల్లో ఒక చిన్న లోపం ఉన్న సరి చేసుకోవాలని సూచిస్తూ చెక్ లిస్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి.అమీర్ బాష, కరస్పాండెంట్స్ శ్రీనాథ్ రెడ్డి, శివ, రాజా, సాయి ప్రభాకర్, చంద్రశేఖర్, శివరాం రెడ్డి, సురేంద్ర నాథ్ రెడ్డి, మహబూబ్ బాషా, మల్లికార్జున, జెడి గిరి, బాలకృష్ణ, పాల్ రాజారావు తదితరులు పాల్గొన్నారు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పేద ప్రజలు ఆపదలో ఉంటే తానున్నానని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి మనసుకు నిదర్శనమని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 30 మంది లబ్ధిదారులకు 23 లక్షల 19 వేల 943 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ ఎక్కువ ఆక్సిడెంట్స్, అనారోగ్య కారణాల వల్ల వచ్చే వారికి, ఆరోగ్యపరంగా ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావల్సిన డబ్బులు లేకపోవడం, వారి స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలా పేదవారి ఆపరేషన్ల ఖర్చుకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 30 మంది లబ్ధిదారులకు 23 లక్షల 19 వేల 943 రూపాయల చెక్కుల రూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, సుబ్బయ్య , కామిని మల్లికార్జున, షేక్ మహమ్మద్ రఫీ (మున్నా), తాటికొండ మహేష్, కృపాకర్, మారుతి ప్రసాద్, జార్జ్, వంటల గల భాస్కర్ రెడ్డి,సదాశివరెడ్డి , జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి అనూహ్య స్పందన

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయదాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పసుపల గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాల మేరకు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైసీపీ అధ్యక్షుడు సన్నల జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య విద్యను పేదలకు దూరం చేసే కుట్రను కూటమి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఈ నెల 10న చలో విజయవాడ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కాలింగి రాముడు తెలిపారు. బుధవారం నంద్యాల సీపీఐ స్వామిరెడ్డి భవనంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాలింగి రాముడు, కార్యదర్శి మోటా రాముడు మాట్లాడుతూ జిల్లాలో ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, గిరిజన హాస్టల్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చే ఆలోచనను విరమించుకోవాలని, అన్ని జిల్లాలలో గిరిజన భవనాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు అధిక సంఖ్యలో చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, తుపాకుల వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య మండల ఉసేని తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని శ్రీ గౌరీ సమేత కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాన్ని బుధవారం పురోహితులు శంకర్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మూడవరోజు ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. గతంలో ఆలయంలో ఉన్న ధ్వజస్తంభం చెక్కది కావడం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయ అర్చకులు ఆల్వకొండ శంకర్ శర్మ సొంత నిధులతో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం నుండి ధ్వజస్తంభానికి విశేష పూజలు నిర్వహించి కార్తీక పౌర్ణమి రోజున ఉదయము ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంకాలం అశేష భక్తజన నడుమ జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: పశువులకు గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు నిర్దేశించి ఆయన మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా డాక్టర్ సలహా మేరకు పరీక్షలు చేయించుకోవాలన్నారు. పశువులకు ఏదైనా వ్యాధులు వచ్చినప్పుడు దగ్గరలో ఉన్న పశువుల ఆస్పత్రి దగ్గరికి వెళ్లి డాక్టర్ సలహా తో తగిన మందులతో నివారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ రామ సుబ్బారెడ్డి, డాక్టర్ జానకి, డాక్టర్ వినయ్, డాక్టర్ రమేష్ గ్రామ సర్పంచ్ భర్త బాలమిన్నెల, గ్రామ పెద్దలు వీరభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.